సాక్షి నంద్యాల

గురువారం । 28 । డిసెంబర్ । 2023



సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి, జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.



కుష్టు వ్యాధిని తరిమేద్దాం

ఆదోనిటౌన్: ప్రారంభ దశలోనే కుష్టు వ్యాధిని గుర్తించి, నిర్మూలిద్దామని డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి అన్నారు. బుధవారం ఆదోని పట్టణంలో డాక్టర్లు, ఆశావర్కర్లు ప్రదర్శన నిర్వహించారు.



వాడవాడలా క్రీడాసంబరం

ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం హోరాహోరీగా సాగాయి. క్రీడాకారుల కోలాహలంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మైదానాలు సందడిగా మారాయి. 8లో ▸

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ కవర్లు వాడితే రూ.2 వేలు జరిమానా

మహానంది: ప్లాస్టిక్ కవర్లు వాడితే రూ.2వేలు జరిమానా విధిస్తామని ఎఫ్ఆర్ఓ ఈశ్వరయ్య హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి నంద్యాల, గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని సర్వనరసింహస్వామి, ఉల్లెడ మల్లేశ్వరస్వామి ఆలయాల సమీపంతో పాటు నల్లమలలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నామన్నారు. ఆలయాల వద్ద షాపుల యజమానులు సైతం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జూట్ బ్యాగులు, పేపర్ కవర్లు విక్రయించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఎకోసెన్సిటివ్ జోన్ చట్టం కింద జరిమానా విధిస్తామన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



ఉత్సవమూర్తుల గ్రామోత్సవ దృశ్యం

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ధనుర్మాస పూజల్లో భాగంగా బుధవారం ఉత్సవ మూర్తులు శ్రీదేవి భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామితోపాటు గోదాదేవి అమ్మవారిని యాగశాలలో కొలువుంచి వేదమంత్రోచ్చారణలతో నవకలశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గోదాదేవి అమ్మవారిని ప్రత్యేక గుడిలో కొలువైన మూలవిరాట్ గోదాదేవి అమ్మవారి సన్నిధికి తోడ్కొని వచ్చి కొలువుంచారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూ ఇయర్ వేడుకల్లో ఆంక్షలు అతిక్రమించొద్దు

- జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి



బొమ్మలసత్రం: న్యూ ఇయర్ వేడుకల్లో పోలీసు ఆంక్షలు అతిక్రమించొద్దని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ 2023కి వీడ్కోలు పలికి 2024కు స్వాగతం పలికే వేడుకల్లో ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువత అవాంఛిత ఘటనల జోలికి వెళ్లకుండా ఆనందోత్సాహాల మధ్య న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకోవాలని సూచించారు. పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామని, ప్రత్యేక పోలీసు బృందాలను నియమిస్తామని ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

పోలీసు ఆంక్షల్లో కొన్ని..

- డిసెంబర్ 31 రాత్రి ఒంటి గంట వరకు మాత్రమే న్యూయర్ వేడుకలు జరుపుకోవాలి.
- ఈవెంట్స్ ఏర్పాటుకు రెండు రోజుల ముందుగా పోలీసుల పర్మిషన్ తీసుకోవాలి. సీసీ కెమరాల పర్యవేక్షణ తప్పనిసరి.
- మోటార్ బైక్‌ల సైలెన్సర్ తీసివేసి అధిక శబ్దం వచ్చేలా రోడ్లపై ప్రయాణించరాదు.
- మద్యం తాగి రోడ్లపై ప్రయాణించరాదు.

ఏపీ సీడ్స్ మేనేజర్‌గా ధనలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి కర్నూలు జిల్లా మేనేజర్‌గా ధనలక్ష్మి నియమితులయ్యారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాసులు ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న జె.ధనలక్ష్మి నియమితులయ్యారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఎలాంటి సమస్యలు లేకుండా రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.95 కోట్లు




నగదును లెక్కిస్తున్న సేవా భక్తులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం రూ.2,95,74,004 వచ్చింది. డిసెంబర్ నెలకు సంబంధించి 26 రోజులకు హుండీ లెక్కించగా బుధవారం ముగిసింది. 26 రోజుల్లో మంచాలమ్మ, రాఘవేంద్రుల హుండీలను గణన చేశారు. ఇందులో నగదు రూ.2,89,63,504, నాణేల రూపంలో రూ.6,10,500 వచ్చింది. అలాగే కానుకల రూపేణా బంగారం 71 గ్రాములు, వెండి 439 గ్రాములు సమకూరినట్లు మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు వివరించారు.



నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల



తుది మెరుగులు దిద్దుకుంటున్న డోన్‌లోని 100 పడకల ఆసుపత్రి



బనగానపల్లెలో పునర్నిర్మించిన ఏరియా ఆసుపత్రి

ఆరోగ్య ప్రాప్తిరస్తు!

- జిల్లాలో రూ.567.36 కోట్లతో వైద్య రంగానికి సొబగులు
- కలికితురాయిగా నంద్యాల వైద్య కళాశాల
- ఎక్కడికక్కడ ఆసుపత్రుల నిర్మాణం
- జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 457 వైద్య శిబిరాల నిర్వహణ
- 2.33 లక్షల మందికి వైద్య సేవలు

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పయనిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. నాడు– నేడు ద్వారా ఈ ఏడాది రూ.92.36 కోట్లతో ప్రభుత్వాస్పత్రులను ఆధునీకీకరించి, సౌకర్యాలు మెరుగుపరిచి నాణ్యమైన వైద్యం అందిస్తోంది. మరో అడుగు ముందుకేసి ప్రతి ఇల్లూ జల్లెడపట్టి, కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు సేకరించి, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వారి చెంతకే వైద్యులను పంపి పరీక్షలు చేసి మందులు అందిస్తోంది. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స కోసం రెఫర్ చేస్తోంది. జిల్లాలో ప్రజల కల సాకారం చేస్తూ పాదయాత్ర హామీలు నెరవేరుస్తూ రూ.475 కోట్లతో నంద్యాలలో మెడికల్ కళాశాల నిర్మించి వైద్య విద్యను మరింత చేరువ చేసింది.

నంద్యాల టౌన్: వైద్య విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాస తప్పించి, పేద, మధ్య తరగతి విద్యార్థులకు స్థానికంగానే వైద్య విద్య అందించాలనే మహోన్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించింది. మెడికల్ కళాశాల భవనం, జనరల్ ఆసుపత్రి భవనాలను 50.93 ఎకరాల్లో 11.84 లక్షల చదరపు అడుగులలో నిర్మించింది. ఇందు కోసం ప్రభుత్వం రూ.475 కోట్ల నిధులను కేటాయించింది. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అన్ని అధునాత వసతులు కల్పించేలా జీ ప్లస్ 3 ఫ్లోర్లతో భవనాన్ని నిర్మించారు. 3 మ్యూజియమ్స్, 8 టీచింగ్ రూములు, 8 లేబోరేటరీలు, 2 ఎగ్జామినేషన్ హాళ్లు, 4 లెక్చరర్ హాళ్లు ఉంటున్నాయి. రెసిడెన్షియల్, యూజీ హాస్టళ్లు, స్టాఫ్ అకామిడేషన్, వర్కింగ్ స్టాఫ్, నర్సెస్ రూమ్స్, గెస్ట్ హౌస్, స్టూడెంట్ నర్సెస్ హాస్టళ్లు, నర్సింగ్ కాలేజీ భవనం ఉంటుంది. హాస్టళ్లలో డైనింగ్‌హాల్, సెంట్రల్ కిచెన్, లాండ్రీ, సెంట్రల్ డ్రగ్ స్టోర్, బయోమెడికల్ వేస్ట్ రూమ్ ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 15న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైద్య కళాశాలను ప్రారంభించారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో డిజిటల్ క్లాస్ రూమ్‌లతో 150 మెడికల్ సీట్లతో పూర్తి స్థాయి విద్యార్థులతో కళాశాలలో మొదటి సంవత్సరం వైద్య విద్య తరగతులు జరుగుతున్నాయి.

ఉన్న ఊరిలో ఉన్నత వైద్యం

అర్ధరాత్రో, అపరాత్రో పాము కరిచినా, కుక్క కాటు వేసినా, గర్భిణికి పురిటినొప్పులు వచ్చినా, వృద్ధుడికి ఛాతిలో నొప్పి వచ్చినా పల్లెవాసులు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. సకాలంలో ఆస్పత్రికి చేర్చేందుకు కుటుంబికులు నానా తంటాలు పడుతుండేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చర్యలు చేపట్టింది.

- బనగానపల్లె పట్టణంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల స్థాయికి పెంచారు. రూ.22 కోట్లు ఖర్చు చేసి ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, ల్యాబ్‌లు కార్పొరేట్ స్థాయిలో నిర్మించారు.
- కోవెలకుంట్లలో రూ.3.8 కోట్లతో 30 పడకల నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ని ప్రారంభించారు.
- అవుకులో రూ.2.43 కోట్లతో 30 పడకల నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ని ప్రారంభించారు.
- ఆళ్లగడ్డలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.3 కోట్ల వ్యయంతో 50 పడకల సమర్థ్యానికి పెంచారు. మినీ వార్డు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ఎమర్జెన్సీ వార్డ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు మరింత విస్తృత సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది.
- నందికొట్కూరులో రూ.4 కోట్లతో 30 పడకలతో అత్యాధునిక ల్యాబ్, ఓపీ వార్డ్, ఆపరేషన్ థియేటర్ తదితర సౌకర్యాలతో నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు.
- డోన్‌లో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.3 కోట్లతో 50 పడకలకు విస్తరిస్తున్నారు. డోన్‌లో గుత్తి రోడ్డులో పది ఎకరాల విస్తీర్ణంలో రూ.26 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ఎక్స్‌రే యూనిట్లు, పిల్లల వార్డు, కాన్పుల వార్డు ప్రత్యేకంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఇదే ఆసుపత్రికి రూ.8 కోట్లతో మూడవ అంతస్తు నిర్మిస్తున్నారు. ల్యాబ్‌లు, ఫార్మా యూనిట్, ఆర్థో, ఈఎన్‌టీ తదితర వార్డులను నిర్మిస్తున్నారు. వీటితో పాటు నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రాణాళికలు సిద్ధం చేశారు. ఈ నిర్మాణాలన్నిటినీ జనవరిలో ప్రారంభించేందుకు తుది మెరుగులు దిద్దుతున్నారు.
- గోస్పాడు మండలం యాళ్లూరులో రూ.5.33 కోట్లతో 30 పడకలతో, ఆత్మకూరులో రూ.3.90 కోట్లతో 30 పడకలతో, వెలుగోడులో రూ. 6.10 కోట్ల వ్యయంతో 30 పడకల నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ప్రారంభించిన ప్రభుత్వం ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తోంది.

పట్టణ వైద్యానికి పట్టం

పట్టణ ప్రాంతాల్లో రూ.1.6 కోట్లతో పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తోంది. నంద్యాల వైఎస్సార్ నగర్, సలీం నగర్, బేతంచెర్లలో రూ.4.8 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రారంభించింది. వీటిలో రక్త కణాలను గుర్తించే సెల్ కౌంటర్, కొలెస్ట్రాల్, లివర్, కిడ్నీ వ్యాధులకు సంబంధించిన అనలైజర్, శరీరంలోని సోడియం, పొటాషియంను పరిశీలించే ఎలక్ట్రోలిస్, మలేరియా ఇతర వ్యాధులకు సంబంధించి రక్త కణాలను పరీక్షించే మైక్రోస్కోప్, రక్తం సీరంను వేరు చేసే సెంట్రీ ఫీజ్ తదితర పరికరాలున్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, అన్ని రకాల జ్వరాలు, వాంతులు, విరేచనాలు, గాయాలకు ఇతర వ్యాధులకు ప్రాథమిక వైద్య సేవలు లభిస్తాయి. అదే విధంగా ఆసుపత్రి పని వేళల్లో మాత్రమే ఇన్‌పేషెంట్స్ అడ్మిట్ కావడానికి పడకల సదుపాయం ఉంది. ఈ ఆసుపత్రిలో ఒకరి చొప్పున వైద్యుడు, ఫార్మాసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ట్ గ్రేడ్ సర్వీస్, ఇద్దరు స్టాఫ్ నర్స్‌తో పాటు ఏఎన్ఎం, ఆశాలు పనిచేస్తున్నారు.



నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య కేంద్రాలు, హాస్పిటల్స్ నిర్మాణాల్లో పురోగతి, వ్యయం వివరాలు

ఆరోగ్య కేంద్రం	మొత్తం	పూర్తయినవి	వ్యయం రూ.కోట్లలో
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	369	194	47.60
అర్బన్ హెల్త్ సెంటర్లు	18	16	25.60
సీహెచ్‌సీలు	10	8	53.56
ఏరియా హాస్పిటళ్లు	3	2	34
మొత్తం	400	220	160.76

ఆరోగ్య సురక్ష ..

రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. వైద్యశిబిరాలు నిర్వహించి ప్రత్యేక వైద్యులను గ్రామాలకు పంపి ప్రజలకు వైద్య పరీక్షలు చేయించి ఆరోగ్య భరోసా ఇచ్చింది. శిబిరాలకు వచ్చిన రోగులకు వైద్య పరీక్షలను చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసింది. మెరుగైన వైద్య సేవలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు పంపి ఆపరేషన్లు చేయించింది.

మా ఊరి ఆస్పత్రిలోనే రెండో కాన్పు



ఆరేళ్ల క్రితం మా ఊర్లో సరైన వసతులు లేవని మొదటి కాన్పు కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాను. రెండవ కాన్పు కోసం కూడా నంద్యాలకు వెళ్లి ప్రయాస పడాల్సిందే అనుకునే దాన్ని. అయితే ఆశ వర్కర్, ఏఎన్ఎంల సూచనలతో మా ఊరిలోని ప్రభుత్వ ఆసుపత్రికే వెళ్లాను. వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించారు. ధైర్యం చెప్పి సాధారణ కాన్పు చేశారు. ఇంతకు ముందు లేని సౌకర్యాలతో ఇంటి సమీపంలోనే వైద్య సాయం అందడం చాలా సంతోషమేసింది. మా ఊరిలోనే ఇన్ని సౌకర్యాలతో ప్రభుత్వం వైద్యం అందించే రోజు వస్తుందనుకోలేదు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉంటుంది.

– రేణుక, వెలుగోడు

మెరుగైన సేవలు



ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం భారీస్థాయిలో ఏర్పాట్లు చేస్తుంది. కొత్త ఆసుపత్రుల నిర్మాణం, వైద్యుల నియామకం, అవసరమైన అత్యాధునిక పరికరాలు అన్నిటిలో ఎక్కడా రాజీ పడకుండా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల ప్రతి ఒక్కరికీ వైద్యం అందించగలిగాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా, వైద్య శిబిరాలను విజయవంతం అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన సేవలు ప్రజలకు అందిస్తాం.

– డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యారోగ్య అధికారి

నందివాహనంపై విహరించిన శ్రీశైల మల్లన్న

- శాస్త్రోక్తంగా స్వామివారి వార్షిక ఆరుద్రోత్సవం



నందివాహనంపై ఊరేగిన శ్రీశైలమల్లన్న


శ్రీశైలం టెంపుల్: ఆరుద్ర క్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైల మల్లికార్జునస్వామి వారికి సాంప్రదాయబద్ధంగా వార్షిక ఆరుద్రోత్సవాన్ని, నందివాహన సేవను జరిపించారు. మంగళవారం రాత్రి మల్లికార్జున స్వామివారికి మహాన్యాస పూర్వక లింగోద్భవ కాల ఏకదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. అనంతరం బుధవారం తెల్లవారు జామున వార్షిక ఆరుద్రోత్సవంలో భాగంగా స్వామిఅమ్మవార్లకు నందివాహనసేవ నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా ముందుగా ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖ మండప ఉత్తర ద్వారం నుంచి వెలుపలకు తోడ్కొని వచ్చి, శోభాయమానంగా అలంకరించిన నందివాహనంపై ఆశీనులను చేసి అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్ర పురవీధుల్లో స్వామివార్ల ఊరేగింపు నిర్వహించారు. పూజల్లో ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు.

కోవిడ్ పరీక్షా కేంద్రాలు ప్రారంభం



పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుధవారం మూడు చోట్ల కోవిడ్ జేఎన్-1 పరీక్షా కేంద్రాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ప్రారంభించారు. ఇందులో ఒకటి ఎఫ్ఎంసీ విభాగం, ఒకటి పీడియాట్రిక్ విభాగం, మరొకటి మెడికల్ విభాగం ఓపీ -9 వద్ద ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో వివిధ రాష్ట్రాల్లో కోవిడ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రిలోని ఎఫ్ఎంసీ-కోవిడ్ జేఎన్-1 విభాగంలో 45 పడకలతో విభాగాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఆసుపత్రిలో 17వేల ఆర్‌టీపీసీఆర్ కిట్లు సిద్ధంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, కోవిడ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇద్దరికి కోవిడ్ పాజిటివ్

కోవిడ్ మహమ్మారి మళ్లీ భయపెడుతోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మొత్తం 84 మందికి పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. అందులో ఒకరు కర్నూలు వాసి కాగా, మరొకరు తెలంగాణా వాసిగా సమాచారం. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు.

శ్రీశైలక్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం



సాలుమండప నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్, చైర్మన్



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్, చైర్మన్

- డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ
- రూ.215.04 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలక్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డితో కలిసి ఆయన బుధవారం శ్రీశైల మహాక్షేత్రంలో రూ.215.04 కోట్లతో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా గంగాధర మండపం వద్ద స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాలు మండప నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో రూ.1,600 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శివుడు ఉద్భవించిన శుభ ఘడియల్లో శ్రీశైల మహాక్షేత్రంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనేది సీఎం లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. గతంలో సాలు మండపాలు శ్రీకృష్ణదేవరాయలు నిర్మించారన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో సాలు మండపాలను నిర్మించడం సంతోషకరమన్నారు. క్షేత్ర వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. 150 మంది క్యాడర్‌స్ట్రెంత్‌కు అనుమతులు ఇచ్చామని, దేవస్థానంలో పనిచేసే ప్రతి కార్మికుడికి సమాన వేతనం ఇస్తామని, త్వరలోనే ధర్మప్రచార మాసోత్సవాలను నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ గతంలో సీఎంను శ్రీశైలానికి ఆహ్వానించేందుకు వెళ్లినప్పుడు ఆలయాల అభివృద్ధి గురించే 45 నిమిషాల పాటు చర్చించి పలు సూచనలు చేశారన్నారు. మంత్రి, ఎమ్మెల్యే, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారుల సహకారంతో క్షేత్రంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఎస్ఈ సి.పుల్లయ్య, ధర్మప్రచార పరిషత్ డైరెక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, జి.నరశింహారెడ్డి, ఎం.విజయలక్ష్మి, మేరాజోత్ హనుమంత్‌నాయక్, తన్నీరు ధర్మరాజు పాల్గొన్నారు.

సమన్వయంతో క్షేత్రాభివృద్ధి

దేవదాయశాఖ మంత్రి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్, సభ్యులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ శ్రీశైలక్షేత్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. వైఎస్సార్‌పీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక క్షేత్రంలో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇప్పుడు మరో రూ.215.04కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశాం. ఇప్పటికే రూ.90కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. మొత్తం రూ.300 కోట్లు క్షేత్రంలో అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్నాం. గతంలో ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఔటర్‌రింగ్‌రోడ్డు, మాడ వీధులు, ఇంటర్నల్ రోడ్డు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం. శ్రీశైలక్షేత్రంలో క్యాడర్‌స్ట్రెంత్ పెంచాల్సి ఉంది. దేవస్థానంలో పనిచేసే కార్మికులందరికీ జీ.ఓ.నెం.7 ద్వారా వేతనాలివ్వాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. 5,300 ఎకరాల దేవస్థాన భూమి తిరిగి దేవస్థానానికి చెందేలా కృషి చేసిన అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

క్లుప్తంగా

‘ఏపీ జేఏసీ అమరావతి’ జిల్లా చైర్‌పర్సన్‌గా మల్లేశ్వరమ్మ

కర్నూలు(సెంట్రల్): ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్‌గా ఎస్.మల్లేశ్వరమ్మ ఎంపికయ్యారు. బుధవారం రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి సమావేశం జిల్లా చైర్మన్ వి.గిరికుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా ఎస్.మల్లేశ్వరమ్మ, అసోసియేట్ చైర్‌పర్సన్‌గా ఎస్.లోకేశ్వరి, కో చైర్‌పర్సన్‌లుగా జ్యోత్స్న, సాలమ్మ, కార్తీక లక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా ముంతాజ్, కార్యదర్శులుగా హెప్సిబా, రాచెల్ క్రైస్తు వేణి, జే.రేణుక, దేవి, ట్రెజరర్‌గా వెంకట అరుణలను ఎన్నుకున్నారు.

వెటర్నరీ అంబులెన్స్‌ల్లో పోస్టుల భర్తీకి చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): డాక్టర్ వైఎస్సార్ వెటర్నరీ అంబులేటరీ సర్వీస్(1962)ల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వెటర్నరీ డాక్టర్, పారావెట్, పైలెట్(డ్రైవర్) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీవీకే ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ జిల్లా మేనేజర్ రామకృష్ణగౌడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంచార పశువైద్యశాలల్లో డాక్టర్లుగా పనిచేసేందుకు బీవీఎస్సీ, ఎంవీఎస్సీ చేసిన వారు, విశ్రాంత పశువైద్యులు అర్హులని, వీరికి నెలకు రూ.36వేల వేతనం, మెడికల్ ఇన్సూరెన్స్, పీఎఫ్ సదుపాయం ఉంటుందన్నారు. పారావెట్ పోస్టులకు వెటర్నరీలో డిప్లొమా చేసి ఉండాలని, వేతనం నెలకు రూ.15 వేలు ఉంటుందని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. డ్రైవర్ పోస్టులకు పదో తరగతి చదివి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, 36 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. నెలకు వేతనం రూ.12,200, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం ఉంటుందన్నారు. డ్రైవర్ పోస్టుల భర్తీలో స్థానికులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. వివరాలకు 91823 30875, 9014774741 సంప్రదించాలన్నారు.

బొమ్మిరెడ్డిపల్లెలో పట్టపగలే చోరీ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న రెండు ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు తాళాలు పగులగొట్టి, ఒక ఇంట్లో బంగారు, నగదు ఎత్తుకెళ్లారు. గ్రామ ద్వారంలో కల్లాల మధ్య ఉన్న ఇంటికి తాళం వేసి గొల్ల ఎల్లరాముడు భార్యతో కలిసి పొలానికి వెళ్లాడు. ఉదయం 11గంటల ప్రాంతంలో ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లు చుట్టు పక్కల వారి సమాచారం అందుకుని వచ్చి పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో 8 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న సీఐ సురేశ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం సీఐ పవన్‌కుమార్ ఆధారాలు సేకరించారు. ఇదే గ్రామంలో గూడెల రవీంద్ర చౌదరి పాత ఇంట్లో చొరబడిన దొంగలు బీరువాలోని రూ.1500 నుంచి 4వేల వరకు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. అయితే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.


హొళగుంద: వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు


పెద్దహరివాణం: బాల్‌ను ప్రత్యర్థి కోర్టులోకి పంపుతున్న క్రీడాకారుడు


ఉయ్యాలవాడలో..


బిజనవేములలో షటిల్ ఆడుతున్న క్రీడాకారిణులు


పెద్దహరివాణంలో కబడ్డీ ఆడుతున్న బాలికలు


కటారుకొండలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

వాడవాడలా క్రీడా సంబరం

- రెండో రోజూ అదే జోష్!
- సందడిగా మారిన క్రీడా మైదానాలు
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం అదే జోష్‌తో సాగాయి. క్రీడాకారుల కోలాహలంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మైదానాలు సందడిగా మారాయి. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ విభాగాల్లో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. తమ ప్రతిభను చాటుకునేందుకు క్రీడాకారులు పోటాపోటీగా తలపడుతున్నారు. కొన్నిచోట్ల విజేతలకు స్థానిక నాయకులు ట్రోఫీలు అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు, యువతను ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తూ జగనన్న ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. – సాక్షి బృందం


సి.బెళగల్‌లో టాస్ వేస్తున్న పీడీ రాఘవేంద్ర

భళా రాజశేఖర్

- 32 బంతుల్లో సెంచరీ



ప్యాపిలి: మండల పరిధిలోని పెద్దపాదిళ్ల సచివాలయం పరిధిలో బుధవారం పెద్దపాదిళ్ల వర్సెస్ చిన్నపాదిళ్ల జట్ల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. 10 ఓవర్ల మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చిన్నపాదిళ్ల జట్టు 172 పరుగులు సాధించింది. అనంతరం భారీ లక్ష్య సాధనతో బరిలోకి దిగిన పెద్దపాదిళ్ల జట్టు 80 పరుగులకే ఆలౌట్ అయ్యింది. చిన్నపాదిళ్ల జట్టులో ఓపెనర్లుగా బరిలోకి దిగిన రాజశేఖర్ 32 బంతులకు 108 పరుగులు, నరేంద్ర 18 బంతులకు 52 పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరును అందించారు. సెంచరీ చేసిన రాజశేఖర్‌ను గ్రామస్తులు అభినందించారు.


దీబగుంట్లలో బోనస్ కోసం ప్రయత్నిస్తున్న క్రీడాకారుడు


వెంగళాంపల్లిలో రైడర్‌ను బెడ్‌లైన్ తొక్కకుండా నియంత్రిస్తున్న ప్రత్యర్థి జట్టు




నందికొట్కూర్ మెడికల్ క్యాంపులో సేవలందిస్తున్న సిబ్బంది, బాల్‌ను బౌండరీకి తరలిస్తున్న క్రీడాకారుడు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం


నరసింహులు,నరసమ్మ(ఫైల్)

ఆళ్లగడ్డ: జాతీయ రహదారి చింతకొమ్మదిన్నె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాలు.. చింతకుంట గ్రామానికి చెందిన పల్లె నరసింహులు (60), భార్య నరసమ్మ (58)తో కలిసి బైక్‌పై పొలానికి వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి గ్రామానికి బయలుదేరారు. కొద్దినిమిషాల్లో ఇంటికి చేరుకునే సమయంలో గ్రామ శివారులో తిరుపతి నుంచి హైదరాబాద్ వైపు అతివేగంతో వెళ్తున్న టెంపో వాహనం వేగాన్ని నియంత్రించుకోలేక వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భార్యాభర్తలను 108 వాహనంలో స్థానిక వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నరసమ్మ, ఆస్పత్రిలో నరసింహులు మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏడుగురు వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్ట్

- నాటుతుపాకులు, కత్తులు స్వాధీనం


వేటగాళ్లను అరెస్ట్ చేసిన అటవీశాఖ అధికారులు, సిబ్బంది

మహానంది: నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్‌డ్ పెద్దపులుల అభయారణ్యంలోని అంకాలమ్మ కుంట వద్ద ఏడుగురు వన్యప్రాణుల వేటగాళ్లను ఫారెస్ట్ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. చలమ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య తెలిపిన వివరాలు.. గాజులపల్లెకు చెందిన తలారి నరసింహులు, ఖాసీమయ్య, హరికృష్ణ, మహేష్, కరీంబాషా, శ్రీనివాసులు, కందికాయపల్లె సుధాకర్‌లు గాజులపల్లె బీట్‌లో వన్యప్రాణుల వేట సాగిస్తుండగా ఎఫ్ఆర్ఓ ఈశ్వరయ్య, డీఆర్ఓ నాగేంద్రనాయక్, ఎఫ్ఎస్ఓలు ఎల్లమ్మ, విజయలక్ష్మి, ఏబీఓలు, సిబ్బంది సోదాలు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారాయ్యారు. వారి నుంచి రెండు నాటుతుపాకులు, ఆరు రౌండ్ల తూటా రవ్వలు, మూడు కత్తులు, రెండు గొడ్డళ్లతో పాటు ఫోన్లు, బైకు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని చలమ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్
APSFC
కర్నూల్ బ్రాంచ్
డి.నెం. 50/706-సి, జిల్లా గెస్ట్ హౌస్ ఎదురుగా, బి.క్యాంప్, కర్నూల్-518002.
ఫోన్: 08518-229056, ఇ-మెయిల్ : kurnool@apsfc.com

SFCల చట్టము, 1951లోని సెక్షన్ 29 క్రింద అమ్మకమునకు బహిరంగ ప్రకటన

SFCల చట్టము, 1951లోని సెక్షన్ 29 క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ (ఏపిఎస్ఎఫ్‌సి) వారు సంబంధిత దిగువ సంస్థ రుణగ్రహీతలు చెల్లించుటలో విఫలమైన దృష్ట్యా తనఖా/తాకట్టు పెట్టిన ఆస్తులపై రికవరీ చర్యలు ప్రారంభించినారు.
టెండరు సహిత వేలం ప్రాతిపదికపై బహిరంగ వేలము ద్వారా "ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలానే మరియు అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన దిగువ జతచేయబడిన ఆస్తుల కొనుగోలు కొరకు సాధారణ ప్రజల నుండి APSFC టెండర్లను కోరుతోంది. (రూ. లక్షలలో)

పారిశ్రామిక సంస్థ పేరు & ప్రదేశము	యూనిట్ యొక్క లైన్	అమ్మకమునకు ఆఫర్ చేసిన ఆస్తులు	రిజర్వు ధర	ధరావత్తు (ఎ) మొత్తం ఆస్తులు (బి) మిషనరీ మాత్రమే
మెస్సర్స్ గౌరి ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, ప్రొప్రైటిక్స్: శ్రీమతి పి.లీలావతి భర్త పి.మల్లయ్య, శంకరప్ప ఇండస్ట్రీయల్ ఎస్టేట్స్, సర్వే నెం. 274, ఉడుములపాడు (గ్రా), డోన్ (మం), కర్నూల్ జిల్లా	ప్లాస్టిక్ హౌస్‌హోల్డ్ గూడ్స్ యొక్క తయారీ	ఎ) భూమి, భవనములు & మెషినరీ: కర్నూలు జిల్లా, డోన్ (మం), ఉడుములపాడు (గ్రా), శంకరప్ప ఇండస్ట్రీయల్ ఎస్టేట్స్, ఎన్‌హెచ్-7 రోడ్‌కు దగ్గరలో ఉన్న సర్వే నెం. 274 ద్వారా కవర్ చేయబడిన 486 చ.గ.ల విస్తీర్ణము గల పారిశ్రామిక భూమి మరియు దానిపై నిర్మించిన భవనములు మరియు మెషనరీ అనగా ఎలక్ట్రికల్స్‌తో కలర్ మిక్సర్/గ్రైండర్, మోటార్స్ మరియు ఇతర యాక్సెసరీస్‌లు.	రూ. 34.38	రూ. 4.58
		బి) మెషనరీ (మాత్రమే): ఎలక్ట్రికల్స్‌తో కలర్ మిక్సర్/గ్రైండర్, మోటార్స్ మరియు ఇతర యాక్సెసరీస్‌లు.	రూ. 3.75	రూ. 0.50

నియమ నిబంధనలు: (1) టెండరు ఫారమును రూ.300/- మరియు రూ.54/-ల జిఎస్‌టితో పాటు క్యాష్/డిడి ద్వారా చెల్లింపు పై దిగువ సంతకందారు నుండి పొందవచ్చును. (2) సీలు వేసిన టెండర్లలో పూర్తి చేసి బ్రాంచ్ మేనేజర్‌కు దాఖలు చేయవలెను. (3) అవసరమైన ధరావత్తును కర్నూల్ వద్ద చెల్లించబడేలా "APSFC" పేరున తీసిన డిడి/పే ఆర్డర్ ద్వారా చెల్లించవలెను. (4) ఈ అమ్మకపు నోటీసు ప్రకటన తేదీ నుండి 90 రోజుల వరకు చెల్లుబాటుగా ఉండును. (5) టెండరు ప్రకటన తేదీ నుండి 90 రోజుల వరకు కొనసాగింపి 31.01.2024న లేదా ఆ తరువాత తెరువబడును మరియు అమ్మకం కొరకు ముందుకు సాగును. (6) ప్రతీ బుధవారమున లేదా ఏదేని సెలవు రోజున బిడ్డింగ్/చర్చల కొరకు టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. (7) ఒక టెండరుదారు కంటే ఎక్కువ మంది హాజరైనప్పుడు బిడ్డింగ్ నిర్వహించబడును మరియు తదుపరి చర్చలు కొనసాగించబడును. మెరుగు పరిచిన ఆఫర్లు ఆహ్వానించి 7 రోజుల కొరకు సరితూగిన ఆఫరు (కమిటీ విచక్షణ మేరకు)ను నోటీసు బోర్డు పై ఉంచబడును. (8) ఈ 7 రోజులలో కొత్త టెండరుదారులు అవసరమైన ధరావత్తుతో టెండర్లు దాఖలు చేయవచ్చును మరియు అదనముగా ప్రదర్శించబడిన ఆఫరులోని 15%ను డిపాజిట్ చేయవచ్చును. మెరుగైన ఆఫర్ల స్వీకరణ పై తదుపరి బిడ్డింగ్/చర్చలు ప్రస్తుతమున్న మరియు నూతన టెండరుదారుల మధ్య నిర్వహించబడును మరియు తదుపరి ఆఫర్లు కార్పొరేషన్ మార్గదర్శకాల ప్రకారం పరిగణించబడును. (9) రిజర్వు ధర కంటే తక్కువ కోట్ చేసిన బిడ్లు తిరస్కరించబడును మరియు ధరావత్తు వాపసు చేయబడును. (10) టెండరు ఫారమునకు జతచేసిన అన్ని ఇతర నియమ నిబంధనలను అనుసరించి కట్టుబడి ఉండవలెను. (11) కార్పొరేషన్ ఏదేని కారణము లేకుండా దాని సొంత విచక్షణ మేరకు నియమ నిబంధనలను మార్చుటకు లేదా రద్దు చేయుటకు లేదా టెండర్లు/బిడ్లను అంగీకరించు/తిరస్కరించు హక్కు కలదు. (12) అమ్మకం కొరకు ఉంచిన ఆస్తులను తనిఖీ చేయుటకు కోరిన బిడ్డర్లు నేరుగా సంబంధిత బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించవచ్చును. (13) ఆస్తులు పై కార్పొరేషన్‌కు తెలిసి ఎటువంటి తాకట్టు రుణభారములు లేవు. ఒక వేళ ఏదైనా తాకట్టు రుణభారము ఉంటే వాటితో కలుపుకొని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే మరియు అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన ఆస్తులు విక్రయించబడును. (14) టెండరుదారు సీలు వేసిన టెండరును దాఖలు చేసినప్పుడు టెండరు ఫారమునకు అనుబంధముగా ఉన్న సాధారణ నియమ నిబంధనలను పూర్తిగా తెలుసుకుని వాటికి కట్టుబడి ఉండవలెను. అయినప్పటికీ ఏదేని తదుపరి వివరణలను కార్పొరేషన్ యొక్క సంబంధిత అధికారుల నుండి టెండరు దాఖలుకు ముందే పొందవచ్చును.

ప్రదేశం: కర్నూలు
తేది: 28.12.2023

సం/- అధీకృత అధికారి
ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్,
కర్నూలు బ్రాంచ్

వంద రోజుల ప్రణాళికపై అశ్రద్ధ!

- విడుదలైన 'పది' పరీక్షల షెడ్యూల్
- వెనుకబడిన విద్యార్థులను గుర్తించడంలో నిర్లక్ష్యం
- ఫలితాల పెంపుపై కనిపించని కసరత్తు

కర్నూలు సిటీ: పదో తరగతి ఫలితాల పెంపునకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేయడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు వెనుకబడిన విద్యార్థులను గుర్తించలేదు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలు బేఖాతర్ అవుతున్నాయి. ఒక్క కేజీబీవీల్లో మాత్రమే 100 రోజుల ప్రణాళికను తయారు చేసుకుని అమలు చేస్తున్నారు. మిగిలిన యాజమన్యాల్లో ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. జిల్లా విద్యాశాఖ, జిల్లా సాధారణ పరీక్షల విభాగం అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పాఠశాల విద్యాశాఖ ఇటీవలే టెన్త్ పరీక్షల షెడ్యూల్ జారీ చేసింది. వచ్చే ఏడాది మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. అయితే జిల్లాలో ఇంత వరకు జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం పరీక్షలకు ఎలాంటి సన్నద్ధత చర్యలు తీసుకోలేదు.


పర్యవేక్షణ కరువు

జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన హైస్కూళ్లు 506 ఉండగా ఇందులో 41,008 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరు ఇటీవలే సమ్మెటివ్–1 పరీక్షలు రాశారు. ఈ ఫలితాలను బట్టి చదువుల్లో వెనుకబడిన విద్యార్థుల గుర్తించి, ఆయా సబ్జెక్టు టీచర్లతో రెమిడియల్ తరగతులు నిర్వహించాలి. ఏఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి, ప్రత్యేకంగా విద్యార్థులను దత్తత తీసుకోవాలి. కానీ ఇంత వరకు వెనుకబడిన విద్యార్థులనే గుర్తించలేదు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గంట పాటు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, ఈ తరగతులను రెగ్యులర్‌గా పర్యవేక్షించేందుకు సెప్టెంబర్‌లోనే డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలకు బాధ్యతలు అప్పగించారు. ఇంత వరకు పర్యవేక్షణ లేకపోవడంతో ప్రత్యేక తరగతులు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు.

సమీక్షలు ఏవీ?

పదో తరగతి విద్యార్థులకు డిసెంబర్ నెలాఖరులోపు సిలబస్ పూర్తి కావాలి. కానీ ఎంత వరకు సిలబస్ పూర్తి చేశారు..ఇంకెంత కావాల్సి ఉంది అనే విషయంపై సమీక్షించే వారే కరువయ్యారు. ఏపీ మోడల్ స్కూళ్లలో అయితే ఏమీ జరుగుతుందో అడిగే దిక్కు లేకుండా పోయింది. ఆ స్కూళ్ల పర్యవేక్షణను గాలికి వదిలేశారు. రెగ్యులర్ ఆఫీసర్ లేకపోవడంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు ఓ అధికారికి అప్పగించారు. దీంతో ఆయన పూర్తి స్థాయిలో పర్యవేక్షించే అవకాశం రావడం లేదు. కేవలం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు మేల్కొకపోతే ‘పది’ ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

పర్యవేక్షణ పెంచుతాం



పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల చివరి లోపు అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తి చేయాలని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాం. దీంతో పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని చెప్పాం. ఈ నెల 28వ తేదీ నుంచి పది విద్యార్థులకు రివిజన్ టెస్టులు నిర్వహించనున్నాం. పర్యవేక్షణను పెంచుతాం.

– రంగారెడ్డి, డీఈఓ

విద్యార్థి బస్సుకు బ్రేకులు ఫెయిల్

ప్యాపిలి: గుడిపాడు రోడ్డులో బుధవారం సాయంత్రం విద్యార్థి బస్సుకు బ్రేకులు ఫెయిల్ కావడంతో ప్రమాదానికి గురైంది. ప్యాపిలిలో వివిధ పాఠశాలలకు చెందిన 25 మంది విద్యార్థులతో డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గుడిపాడుకు బయలుదేరింది. చిన్నకనుమ దిగే సమయంలో బ్రేకులు ఫెయిలయ్యాయి. అప్రమత్తమైన డ్రైవర్ పవన్‌కుమార్ చాకచక్యంగా పెద్దరాయిని ఢీకొట్టి బస్సును ఆపేశాడు. డ్రైవర్, కండక్టర్‌తో పాటు మరో ఐదుగురు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకు విచారణ చేపట్టారు.

మందుబాబులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం తాగి వాహనం నడిపిన వారికి సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి బుధవారం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన గొంగటి అభిషేక్, కట్టుబడి సురేష్ మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరచగా నేరం రుజువు కావడంతో కట్టుబడి సురేష్‌కు ఎనిమిది రోజులు, గొంగటి అభిషేక్‌కు పది రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ REGULAR/DISTANCE/ONE SITTING/ DISCONTINUED/FAILURES/DETAINED: 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, BA, BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, BBA, BCA, BED, MPED, LLB, MPHW, MBA, MCA, AGBSC, PHD. UNIVERSITY VIST COMPULSORY. Cell: 8686172989 [L-806298]

■ 3 నెలల్లో Diploma/ B.Tech/ LLB/ BL/ Part Time - అన్ని Govt. Jobs కు Eligible, Exams-Feb-2024. గ్యారెంటీ పాస్‌కై కృషి. 7995053670, 9550271042. [C-777291]

■ Single Sitting : 10th, 12th, BA, B.Com, B.Sc, MA, MCom, MSc, MBA, BBA, BCA BTECH, DIPLOMA, AGRICULTURE, PHARMACY, NURSING (for drop outs/ Backlogs) from UGC recognised Universities CALL : FCC: 1800-570-3344 [R-221]

REAL ESTATE

PLOT FOR SALE

■ ట్వినేషనపాడు రోడ్‌లో "శికాంత్ టౌన్‌షిప్" నందు తూర్పు ముఖము (6 సెంట్లు) ప్లాట్ నంబర్ 55,56 మరియు సర్వాస్తమ వద్ద "టెంపుల్ లైఫ్" నందు మెయిన్ రోడ్ తూర్పు, దక్షిణ ముఖంగల ప్లాట్ నెంబర్ 112 (8.5 సెంట్లు) అమ్మబడును. ఫోన్ 8977209682. [H-788174]

HOUSE FOR SALE

■ కర్నూలు – నంద్యాల రోడ్, సఫా కాలేజీ, రింగ్ రోడ్డు దగ్గర, మెయిన్ రోడ్‌కు 3 సెంట్లలో ఇల్లు కట్టించి ఇవ్వబడును. & ఓర్వకల్లులో ఓపెన్ ప్లాట్లు కలవు. సంప్ర: 99638 00314 [L-822279]

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు, సిటీకాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367. [T-222]

WANTED

■ బనగానపల్లె నెహ్రూ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ హాస్టల్ నందు పని చేయుటకు వార్డెన్లు, కేర్ టేకర్స్, పిఈటిలు కావలెను. సెల్: 9550131444, 6302026495. [L-822277]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేయుటకు యువతీ, యువకులు కావలెను. మంచి జీతం, వయస్సు 23 to 40 సం॥లు వరకు, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. 89197 17202. [L-822276]

■ Wanted Male and Female PRO's we have an Immediate Requirement for the position of PRO's at International Delhi Public school, Kurnool. Qualification : Any Degree with professional attitude & Good verbal communications. walk-In : on 28-12-2023 & 29-12-2023 from 10AM to 1:00PM. Venue : International Delhi publics school, KJR CITY, NH-44, Chinnatekur, KURNOOL. Cell : 9154770701/9154770702. [L-822278]

■ కర్నూలులోని ప్రముఖ సంస్థ కోసం మేము కర్నూలు/నంద్యాల జిల్లాల్లోని గ్రామాలను కవర్ చేయడానికి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. జీతం + TA + DA ఉంటుంది. వివరాలకు సంప్ర: 90329 99565, + 91 863-9823216 [C-1249603]

■ కన్సల్టెన్సీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ : 15000 -40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. 7993583999 [HA-1036]

■ మీ గ్రామం/ మీ మండలంలోనే ఉంటూ My V3 Ads కంపెనీలో Work చేయుటకు Male/ Females కావలెను. Contact: G. Murali ✆ 9030661651 [G-1419]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం జీ.18K.ఫోన్ 9640258899/9640468899. [HA-1041]

■ ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు & ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వర్క్ చేయడానికి ఫిమేల్ స్టాఫ్ అ,కా, ను అ: ఇంటర్, డిగ్రీ జీ. 17k to 35k ఇంట్రెస్ట్ ఉన్నవారు వెంటనే డిటెయిల్స్ వాట్సప్ చేయండి. 7842295941. [H-788045]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.